క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి



ప్లాస్టిక్ వాడొద్దని అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

రాజాం సిటీ: నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ సంచులు వాడకుండా పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని నర్సీపట్నానికి చెందిన కళాజాత బృందం కోరింది. ఈ నెల 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ఆవరణలో ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణపై కళాప్రదర్శన ద్వారా శుక్రవారం అవగాహన కల్పించారు. ఆటపాటలు, నాటక రూపంలో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఆరోగ్యవంతమైన సమాజానికి ప్లాస్టిక్‌కు బదులు గుడ్డసంచులను వాడాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం



విద్యార్థులతో క్యారమ్స్ ఆడిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి, తెర్లాం–5 అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త వై.శ్రీదేవి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయానికి శుక్రవారం విచ్చేసిన విద్యార్థుల మధ్య పలు క్రీడాపోటీలు నిర్వహించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తెలిపారు. క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఉన్నత శిఖరాలు చేరుకున్నారని ఉదహరించారు. ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని, చదువు, క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని తెలిపారు.

వేంకటేశ్వరునికి చక్రస్నానం

రాజాం సిటీ: స్థానిక తెలగవీధి సత్యనారాయణపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి శుక్రవారం చక్రస్నానం చేశారు. ఆలయ తొమ్మిదో వార్షికోత్సవం పురస్కరించుకుని, జూన్ 30వ తేదీ నుంచి చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామని, దీంతో వార్షికోత్సవాలు పూర్తయ్యాయని అర్చకులు తెలిపారు. దీంతో పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు, మహా పూర్ణాహుతి, ధ్వజారోహణ కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

ప్రధానోపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయాలి

రేగిడి: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయుల ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఏవీపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశమైన ఆయన బ్లాకింగ్ ఎత్తివేయాలని, అవసరమైతే ఫౌండేషన్ ప్లస్ పాఠశాలల్లో పీఎస్ ప్రధానోపాధ్యాయులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సీతంనాయుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమృత సరోవర్ పనుల పరిశీలన

బాడంగి: ఉపాధి హామీ పనుల్లో భాగంగా మండలంలోని పిన్నవలస, ఆకులకట్ట, వాడాడ గ్రామాల్లో చేపడుతున్న అమృత సరోవర్(చెరువులు/కోనేరులు) అభివృద్ధి పనులను ఇరిగేషన్ డీఈఈ బృందం శుక్రవారం పరిశీలించింది. ఒక్కో కోనేరు అభివృద్ధికి దాదాపు రూ.6 లక్షల వరకు నిధులు మంజూరయ్యాయని, ఈ నేపథ్యంలో పనులు ఏ మేర నాణ్యతా ప్రమాణాల ప్రకారం జరిగాయా యన్న విషయం పరిశీలిస్తున్నామని పీఓ లక్ష్మీపతిరాజు తెలిపారు. కార్యక్రమంలో గజపతినగరం ఇరిగేషన్ సర్కిల్ డీఈఈ పాండు, సోషల్ ఆడిట్ ఆడిటర్ డీఆర్‌పీ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

బోగస్ మస్తర్లు వేస్తే చర్యలు

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ సాయిరాం శుక్రవారం పరిశీలించారు. జాబ్ కార్డు ఉన్న వారినే పనికి అనుమతించాలని, ఒకరి పేరు మీద మరొకరు పనిలోకి రావడానికి వీలు లేదన్నారు. బోగస్ మస్తర్లు వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నిర్దేశిత కొలతల్లో పనిచేస్తే రోజుకు రూ.272 వేతనం లభిస్తుందన్నారు.
రేగిడి: మండలంలోని లచ్చనవలస గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ ఎస్.హరనాథరావు పరిశీలించారు. రెండు పూటలా నిర్దేశిత కొలతల్లో పనిచేస్తే గిట్టుబాటు వేతనం లభిస్తుందని ఆయన వేతనదారులకు తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.
బొబ్బిలి: మండలంలోని వెలగవలస, కాశిందొరవలస గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీడీ జనార్దనరావు పరిశీలించారు. వేసవి ఎండల నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త వహించాలని ఏపీడీ సూచించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని నెమలాం గ్రామంలో శుక్రవారం పర్యటించిన ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. అన్ని వర్గాలకు మేలు చేయాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమని, అందుకే అన్ని రంగాల్లో అన్ని వర్గాల ప్రజలకు సమప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలతో ప్రతీ ఇంటికి లబ్ధి చేకూరుతోందన్నారు. అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు అని, ఓ వైపు అభివృద్ధి చేస్తూనే ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేయడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును చూసి, ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. ప్రస్తుతం అమలవుతున్న పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావాలని, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ బొబ్బిలి, తెర్లాం మండలాల అధ్యక్షులు ఎస్.వేణుగోపాలనాయుడు, ఎన్.బాబ్జీరావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, మండల వైస్ ఎంపీపీ సీహెచ్ సత్యనారాయణ, బాడంగి జెడ్పీటీసీ రామారావు, మండల పార్టీ సీనియర్ నేత టి.సత్యంనాయుడు, ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు తీసుకోండి



సమీక్ష సమావేశంలో పాల్గొన్న హౌసింగ్ డీఈ అప్పయ్య, ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు తీసుకోవాలని హౌసింగ్ డీఈ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అధ్యక్షతన గృహ నిర్మాణాలపై సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. హౌసింగ్ డీఈ, ఎంపీడీఓ సచివాలయాల వారీగా గృహ నిర్మాణాల ప్రగతిపై ఆరాతీశారు. త్వరలో సామూహిక గృహ ప్రవేశాలకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని, ఈలోగా మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పూర్తయ్యేలా చూడాలన్నారు. ఇళ్లు నిర్మిస్తున్న లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులో ఎటువంటి జాప్యం లేకుండా చూడాలన్నారు. మండలానికి మంజూరైన 2251 ఇళ్లల్లో ఇప్పటికే చాలావరకు శ్లాబులు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయని, వాటిని వీలైనంత త్వరగా పూర్తి చేయించాలన్నారు.

లేగదూడల ప్రదర్శన



కార్యక్రమంలో ఎంపీపీ సన్యాసినాయుడు, తదితరులు

మెంటాడ: మండలంలోని కొంపంగి గ్రామంలో లేగదూడల ప్రదర్శన శుక్రవారం చేపట్టారు. కృత్రిమ గర్భాధారణ వల్ల ఆడదూడల జననంతో పాలదిగుబడి పెంచడమే ప్రధాన ఉద్దేశ్యమని, దీనిపై పశువైద్యాధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నారని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. పాడిరైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అన్ని వర్గాలకు అన్ని విధాలా న్యాయం చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ప్రశంసించారు. రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం లేగదూడల ఆరోగ్యానికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చల్లపేట వైద్యాధికారి అవినాష్, వైస్ ఎంపీపీ ఎస్.ఈశ్వరరావు, పార్టీ మండల నాయకులు ఎల్.రత్నాకర్ నాయుడు, ఆర్.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులాల వివరాలు సేకరించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: గ్రామాల్లోని మినీ గోకులాల వివరాలు సేకరించండి అని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. స్థానిక మండల సమావేశ భవనంలో ఉపాధి, పశుసంవర్థక శాఖ సాంకేతిక సహాయకులు, పశుసంవర్థక సహాయకులతో శుక్రవారం సమావేశమైన ఆయన గతంలో టీడీపీ హయాంలో 2028–19 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో రైతులు నిర్మించిన మినీ గోకులాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటోందని, బిల్లుల చెల్లింపుల కోసం మినీ గోకులాల వివరాలను సచివాలయ పశుసంవర్థక సహాయకులు, ఉపాధి సాంకేతిక సహాయకులు సంయుక్తంగా వివరాలు సేకరించి, అందజేయాలని తెలిపారు. ఏపీఓ జగదీశ్వరరావు మాట్లాడుతూ మండలానికి 117 మినీ గోకులాలను గత టీడీపీ ప్రభుత్వం మంజూరు చేయగా, వాటిలో 48 మినీ గోకులాలకు ఉపాధి నిధులు మంజూరు చేసేందుకు ఎఫ్‌టీఓలు తయారు చేయడం జరిగిందని తెలిపారు. మిగిలిన 69 మినీ గోకులాల పరిస్థితి ఏవిధంగా ఉందో వాస్తవ సమాచారం కార్యాలయానికి సమర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డీవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



కోటి చెరువులో ఆక్రమణదారులు కబ్జాకు పాల్పడుతున్న ప్రాంతాన్ని చూపిస్తున్న సీపీఐ నేత అప్పన్న

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని కోటి చెరువును క్రమక్రమంగా ఆక్రమించుకుంటున్న వారి(ఆక్రమణదారులు)పై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న డిమాండ్ చేశారు. శుక్రవారం చెరువు ప్రాంతాన్ని సందర్శించిన ఆయన అక్కడి ఆక్రమిత ప్రదేశం గుర్తించి, విలేకరులతో కాసేపు మాట్లాడారు. నాయుడు కాలనీ ఆనుకుని ఉన్న ఈ చెరువులో దాదాపు 50 సెంట్ల స్థలాన్ని కొంతమంది భూకబ్జాదారులు రాత్రి వేళల్లో కంకరతో చదును చేయిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల ఇక్కడి కాలనీకి దగ్గరగా పెద్దఎత్తున సీసీ రోడ్ల నిర్మాణం జరగడంతో ఇక్కడి స్థలానికి మార్కెట్ విలువ పెరిగిందని, దీంతో కబ్జాదారులు ఆక్రమణకు పాల్పడుతున్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

తెర్లాం: మనబడి నాడు–నేడు పథకం ఫేజ్–2 కింద పాఠశాలల్లో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, ఎంఈఓ జె.త్రినాథరావు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మనబడి నాడు–నేడు పనులపై సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని ఏయే పాఠశాలల్లో ఏ మేర పనులు జరుగుతున్నాయో, పనుల పురోగతి ఏ విధంగా ఉందో ఆరాతీశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, మనబడి నాడు–నేడు పథకం కింద అభివృద్ధి పనుల కోసం కొన్ని రూ.లక్షలు వెచ్చిస్తోందన్నారు. పనుల్లో ఎటువంటి అవకతవకలు, నాణ్యతా లోపం కనిపించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలల పునః ప్రారంభం నాటికి పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు.

పనులు వేగవంతం చేయాలి..

సంతకవిటి: మండలంలోని అన్ని గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న మనబడి నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని ఎస్ఎస్ఏ డీఈఈ ఎ. మురళీమోహన్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన పాఠశాలలకు మంజూరైన మనబడి నాడు–నేడు రెండో విడత పనులను సెలవుల్లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి, ఎంఈఓ బి.శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

12లోగా విధుల్లో చేరాలి

బొబ్బిలి: విద్యాశాఖలో ఇటీవల బదిలీలైన వారంతా వారి వారి స్థానాల్లో ఈ నెల 12వ తేదీలోగా విధుల్లో చేరాలని డీఈఓ లింగేశ్వరరెడ్డి ఆదేశించారు. స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కాలేజీలో 1998, 2008, 2018 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు ఇస్తున్న ప్రత్యేక శిక్షణను శుక్రవారం పరిశీలించిన ఆయన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పాఠశాలల పునఃప్రారంభం నాటికి మనబడి నాడు–నేడు పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ ఎస్.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



తెర్లాం: తహసీల్దార్ రత్నకుమార్



రామభద్రపురం: ఎం.రాజారావు



రాజాం: ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన తహసీల్దార్ కృష్ణంరాజు

తెర్లాం: తహసీల్దార్‌గా బి.రత్నకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. సిబ్బంది సహకారంతో ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.
రామభద్రపురం: స్థానిక తహసీల్దార్‌గా ఎం.రాజారావు పదవీ బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.
రాజాం: తహసీల్దార్‌గా ఎస్.కృష్ణంరాజు శుక్రవారం విధుల్లో చేరారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కంబాల జోగులును మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు.
తెర్లాం: డిప్యూటీ తహసీల్దార్‌గా జి.భాస్కరరావు బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

డ్రోన్ సర్వే ప్రారంభం



రాజాం: డ్రోన్ సర్వే ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రాజాం: భూముల రీసర్వేలో భాగంగా మండలంలోని గడిముడిదాం గ్రామంలో డ్రోన్ సర్వేను ఎంపీపీ లావేటి సులోచన శుక్రవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ భూముల రీసర్వేతో రైతుల మధ్య నెలకొన్న కొన్ని వందల ఏళ్ల భూ తగాదాలు పరిష్కారమవుతున్నాయన్నారు. రైతుల సమక్షంలోనే సర్వేయర్లు సర్వే చేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన జగనన్న శాశ్వత భూ హక్కు పథకం రైతులకు వరం లాంటిదన్నారు. ఇప్పటికే మండలంలోని రామానుజులపేట, బొద్దవలస, విజయరాంపురం, గుయ్యానవలస, నందబలగ, కొఠారిపురం, ఎంజేవలస, కంచరాం, ఒమ్మి, డీఆర్ఎన్‌వలస గ్రామాల్లో పూర్తి స్థాయిలో సర్వే జరిగిందని, రైతులకు భూ హక్కు పత్రాలు కూడా పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ అచ్యుతరావు, సర్వేయర్ గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

95 శాతం పెన్షన్ల పంపిణీ



పెన్షన్ నగదు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి, వలంటీర్

బాడంగి: మండలంలో శుక్రవారం నాటికి 95 శాతం మేర సామాజిక పెన్షన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీఓ అక్కారావు తెలిపారు. మండలంలో మొత్తం 8,474 మంది లబ్ధిదారులు ఉండగా, 8,050 మందికి పెన్షన్లు అందజేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన వాటిని కూడా రెండు, మూడు రోజుల్లో ఇచ్చేస్తామన్నారు.

విశాఖపట్నం వెళ్లి..

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన వలంటీర్ పాముల పోలమ్మ తన ఔదార్యం చాటుకుంది. తన గ్రామ సచివాలయం పరిధిలోని పెన్షన్ లబ్ధిదారు అయిన దొర చంకమ్మ అనారోగ్యంతో విశాఖపట్నంలో చికిత్స పొందుతుండగా, ఆమె వద్దకు శుక్రవారం వెళ్లి, పెన్షన్ అందజేసి, అందరి మన్ననలు అందుకున్నారు.

ప్రతి ఇంటా 'సంక్షేమ' వెలుగులు



సంతకవిటి: ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలతో ప్రతిఇంటా సంక్షేమ వెలుగులు నెలకొన్నాయని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాలాడ గ్రామంలో శుక్రవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ నాలుగేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, అభివృద్ధితో పాటు అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అమలు చేస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రస్తుతం అమలులోని సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీల్లో దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. గతంలో టీడీపీ 650 హామీలిస్తే అందులో ఆరు కూడా నెరవేర్చని దుస్థితి అని విమర్శించారు. మళ్లీ ఇప్పుడు ఆ రాష్ట్రం, ఈ రాష్ట్రంలోని పథకాలను కాపీ కొట్టి, టీడీపీ మరో మేనిఫెస్టో విడుదల చేసి, ప్రజలను మోసగించేందుకు సిద్ధమైందని ధ్వజమెత్తారు. నీరు–చెట్టు పథకం పేరిట ఆ పార్టీ ప్రజాధనం దోచుకున్న విషయం కూడా రాష్ట్రమంతా తెలుసన్నారు. ఇప్పటివరకు జగనన్న ప్రభుత్వం అమలు చేసిన పథకాల్లో ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహనరావు, తాలాడ ఎంపీటీసీ సభ్యుడు కె.సన్యాసినాయుడు, సర్పంచ్ వి.గౌరి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వామినాయుడు, సిరిపురం సర్పంచ్ డి.తిరుపతి, ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి, ఏపీఎం సీతారాం, ఏపీఓ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

'గడప గడప'తో అభివృద్ధి పరుగులు



తారాపురంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు



రొంపల్లిలో నిర్మాణ దశలో సీసీ రోడ్డు

రామభద్రపురం: అభివృద్ధి, సంక్షేమం, ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో ప్రతీచోట అభివృద్ధి పరుగులు తీస్తోంది. కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తున్న నేతలను గ్రామస్తులు కోరిన అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో చాలా ప్రాంతాల్లో చాలా అభివృద్ధి పనులు చకచకా జరిగిపోతున్నాయి. నగరాలు, పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు ఇలా ఏ రకమైన పని అయినా స్థానిక నేతలు, అధికారుల ఆధ్వర్యంలో ఊపందుకోవడం విశేషం. బొబ్బిలి డివిజన్‌లోని బొబ్బిలి, రాజాం, గజపతినగరం నియోజకవర్గాల్లో ఇప్పటివరకు సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున 415 పనులకు గాను రూ.12.20 కోట్ల నిధులతో రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న సమస్యలు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో పరిష్కారమవుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వలంటీర్లకు సత్కారం



రేగిడి: సత్కారం అందుకున్న వలంటీర్లు



బొబ్బిలి: వలంటీర్లను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీ కృష్ణారావు

బొబ్బిలి: వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టణంలోని వార్డు సచివాలయాల పరిధిలో సేవలందిస్తున్న వలంటీర్లను మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు శుక్రవారం సత్కరించారు. మున్ముందు కూడా ఇదే విధంగా పనిచేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఎం.తిరుపతిరావు, పి.ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.
బాడంగి: మండలంలోని ముగడ గ్రామ సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించి, అక్కడి వలంటీర్లను సేవామిత్ర పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత శివప్రసాద్, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, కార్యదర్శి సుగుణ తదితరులు పాల్గొన్నారు.
రేగిడి: మండలంలోని మునకలవలస గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించి, ఉత్తమ వలంటీర్లను సేవామిత్ర పురస్కారంతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో గ్రామదేవతల పండగ



తారాపురం గ్రామంలో పర్యటిస్తున్న సీఐ తిరుమలరావు, ఎస్ఐ సురేంద్రనాయుడు

రామభద్రపురం: ప్రశాంత వాతావరణంలో గ్రామదేవతల పండగను జరుపుకోవాలని సీఐ తిరుమలరావు సూచించారు. మండలంలోని తారాపురం గ్రామంలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో గ్రామదేవతల పండగ నేపథ్యంలో ఆ గ్రామాన్ని శుక్రవారం సందర్శించిన సీఐ సిరిమాను ఊరేగింపు, పండగ రద్దీ ఉండే ప్రాంతాలను పరిశీలించారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం గ్రామపెద్దలతో సమావేశమై పండగలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని తెలిపారు. గ్రామం 26వ నంబర్ జాతీయ రహదారి ఆనుకుని ఉండడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం ఉందని, పాదచారులు, ప్రయాణికులు, వాహనదారులు సహకరిస్తే ఆ సమస్య రాకుండా చూడొచ్చన్నారు. ఆయన వెంట ఎస్ఐ సురేంద్రనాయుడు ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రేగిడి: యోగా, ధ్యానం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని హైకోర్టు న్యాయవాది ఎం.వేణుగోపాలనాయుడు తెలిపారు. స్థానిక విశ్వసాయి మందిరంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న ఉచిత యోగా తరగతులకు శుక్రవారం హాజరైన ఆయన యోగా ప్రాముఖ్యత, ధ్యానం ద్వారా ఆయుష్షు పెంచుకునే మార్గం వివరించారు. కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి కన్వీనర్ ఎం.శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.